క్లుప్తంగా

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


శివాజీని సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రకాశం నగర్ : భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ది రాజమండ్రి టెన్నిస్ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ డెఫ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం, డబుల్స్ విభాగంలో వెండి పతకం సాధించిన పిల్లా శివాజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం.రజనీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, టెన్నిస్ క్లబ్ చైర్మన్ వి.భాస్కర్‌రామ్, జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ముళ్ళ మాధవ్, జి.కిషోర్ శివాజీకి అభినందనలు తెలిపారు.

చేతుల పరిశుభ్రత ఆరోగ్యకర జీవనానికి తొలిమెట్టు

కడియం: చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఆరోగ్యకర జీవనానికి తొలిమెట్టు అని దుళ్ళ గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు అన్నారు. గ్లోబల్ హేండ్‌వాష్ డేను పురస్కరించుకుని ఆదివారం చేతుల పరిశుభ్రతపై గ్రామంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అతిసారం, శ్వాసకోశ తదితర అత్యంత ప్రమాదకరమైన వ్యాధులను కూడా చేతుల పరిశుభ్రతతో దూరం చేసుకోవచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శి విజయరాజు, వార్డు సభ్యులు పిచ్చిక చినవెంకట్రావు, శివయ్య, సచివాలయ సిబ్బంది రేవతి, తేజ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

కడియం: స్థానిక హైస్కూలు గ్రౌండ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్టు, జీఎస్ఆర్ గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 600 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అంగరరామ్మోహనరావు, వెలుగుబంటి రఘురామ్, మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేతులకు తాళ్లు కట్టుకుని నారా భువనేశ్వరి నిరసన


చేతులకు తాళ్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న నారా భువనేశ్వరి

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆదివారం రాత్రి 7 గంటల నుంచి 7.05 గంటల వరకు టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా 'న్యాయానికి సంకెళ్లు' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా రాజమహేంద్రవరంలోని విద్యానగర్‌లో లోకేష్ క్యాంపు కార్యాలయం వద్ద నారా భువనేశ్వరి మహిళలతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. భువనేశ్వరి తన చేతులకు తాళ్లు కట్టుకుని నిరసన తెలిపారు. బాబుతో నేను, న్యాయానికి సంకెళ్లు అంటూ మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధర్మం నశించాలి, అన్యాయం నశించాలి అని నినాదాలు చేశారు. ఈ నిరసనలో మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నందమూరి రామకృష్ణ పాల్గొన్నారు.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే

- మొదటి రోజు వివిధ అలంకరణల్లో అమ్మవారు
- దర్శించుకున్న భక్తులు, ప్రజాప్రతినిధులు
- ఉదయం నుంచే కుంకుమ పూజలు
- దేవీచౌక్ బాలాత్రిపురసుందరి సన్నిధిలో భవానీ దీక్ష స్వీకరించిన ఎంపీ భరత్


అమ్మవారికి హారతి ఇస్తున్న ఎంపీ భరత్‌రామ్


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

సీటీఆర్: నగరంలో పలు దేవాలయాల్లో, పలుచోట్ల అమ్మవారు వివిధ అలంకరణలతో దర్శనం ఇచ్చారు. దేవీచౌక్‌లో మొదటి రోజు ఆదివారం స్వర్ణకవచ అలంకార దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మను ఏకాగ్ర చిత్తంతో భక్తిగా పిలిస్తే పలుకుతుందని, అంతటి కరుణామూర్తి సన్నిధిలో భవానీ దీక్ష స్వీకరించడం చాలా ఆనందంగా ఉందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం శరన్నవరాత్రి మహోత్సవాలు ఆరంభమయ్యాయి. స్థానిక దేవీచౌక్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అమ్మవారి మంటపంలో దీక్ష తీసుకున్నారు. శరన్నవరాత్రులు తొమ్మిది రోజుల పాటు ఈ దీక్ష ఉంటుందని, ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు ఎంపీ మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. రాజమండ్రి దేవీచౌక్‌లో కొలువైయున్న బాలాత్రిపురసుందరి అమ్మవారు చాలా మహిమాన్వితురాలని అన్నారు. ఎంపీ భరత్ వెంట ఆయన తల్లిదండ్రులు మార్గాని నాగేశ్వరరావు, ప్రసూన, వైఎస్సార్ సీపీ నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, మార్గాని సురేష్, మజ్జి అప్పారావు, పోలు విజయలక్ష్మి, సంకిస భవానీ ప్రియ, దీపు ఉన్నారు.

అమ్మవారి పూజల్లో పాల్గొన్న డాక్టర్ గూడూరి దంపతులు

వైఎస్సార్ సీపీ రాజమండ్రి సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దసరా పర్వదిన ప్రత్యేక పూజల్లో పాల్గొని పలుచోట్ల దసరా ఉత్సవాలను ప్రారంభించారు. 48వ డివిజన్లో క్లస్టర్ ప్రెసిడెంట్ వాసు ఆధ్వర్యంలో శాంతి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రెండవ డివిజన్‌లో నారాయణపురంలో కనకదుర్గాదేవి రెండవ శరన్నవరాత్ర మహోత్సవాలకు హాజరయ్యారు. జేఎన్‌రోడ్డులోని స్వర్ణ దుర్గా దసరా ఉత్సవ మహోత్సవానికి హాజరయ్యారు. స్థానిక దేవీచౌక్‌లో కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌కు ఉత్సవ కమిటీ స్వాగతం పలికింది.

వైభవంగా దేవీ నవరాత్ర ఉత్సవాలు

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన కడియంతో పాటు పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం తొమ్మిరోజుల పాటు విశేష కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దుళ్ళ మార్కెట్ సెంటర్‌లోని శ్రీ శారదా అమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్ర వేడుకలలో భాగంగా అమ్మవారి చిత్రపటానికి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. వీరనాట్య బృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కడియం మేకల దిబ్బపై నవదుర్గామాత విగ్రమాన్ని ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. కడియపులంకలోని శ్రీ అపర్ణా సమేత అనంతేశ్వర స్వామివారి ఆలయం వద్ద అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి.

కొలువు తీరిన అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో ఆదివారం శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మోరంపూడి సాయినగర్‌లో వేంచేసియున్న శ్రీవిజయ కనకదుర్గాదేవి ఆలయంలో 33వ శరన్నవరాత్ర ఉత్సవాలను ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని బాలాత్రిపురసుందరిదేవి అమ్మవారిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. బాలాజీపేట సెంటర్‌లో శ్రీవిజయకనకదుర్గాదేవి ఆలయంలో ఆలయ ధర్మకర్త, న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల పూజలతో ప్రారంభించారు. అమ్మవారిని శ్రీబాలాత్రిపురసుందరిదేవిగా అలంకరించారు. బొమ్మూరు జాతీయ రహదారి పక్కన శ్రీకనకదుర్గాదేవి ఆలయంలోను, రాజవోలు రోడ్డులోని కనకదుర్గాదేవి ఆలయంలో, శ్రీనాగదుర్గాదేవి ఆలయంలోను ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. కొంతమూరులోని బీసీకాలనీలో శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కనకదుర్గమ్మ కరుణ ప్రజలపై ఉండాలి

కనక దుర్గమ్మ కరుణ ప్రజలందరిపై ఉండాలని ఆ తల్లిని వేడుకున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. నగరంలో పలుచోట్ల నెలకొల్పిన దేవీ మండపాలను ఎంపీ దర్శించారు. సీతంపేటలో అజ్జరపు హరిబాబు నేతత్వంలో నిర్వహిస్తున్న 34వ దసరా మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మంటపాన్ని, మంగళవారపు పేటలో బిల్డర్ చిన్న ఆధ్వర్యంలోను, కోటిపల్లి బస్టాండు వద్ద టాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంటపాన్ని, కోటిపల్లి బస్టాండు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో విజయ దుర్గమ్మ దసరా మహోత్సవాలు, ఏపీఎస్ఆర్టీసీ బస్టాండు వద్ద కనక దుర్గమ్మ ఆలయం వద్ద దసరా ఉత్సవాలలో ఎంపీ భరత్ పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే రాజా

సీటీఆర్ఐ: శక్తి స్వరూపిణి దుర్గాదేవి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల అన్నింటా విజయం చేకూరుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజనగరం శాసనసభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం దేవీ నవరాత్రి మహోత్సవం ప్రారంభ సందర్భంగా పలుచోట్ల అమ్మవారి ఆలయాలలో జక్కంపూడి రాజా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా రాజమహేంద్రవరం మంగళవారపుపేట శ్రీశ్రీశ్రీ విఘ్నేశ్వర రాధాకృష్ణ సహిత కనకదుర్గ దేవి మందిరంలో పెంకే సురేష్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారంపేట చిన్న గాంధీ బొమ్మ దగ్గర బిల్డర్ చిన్న సమక్షంలో శ్రీ దుర్గా యూత్ కమిటీ ఆధ్వర్యంలో 29వ దేవీ నవరాత్రి మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజమహేంద్రవరం స్వరాజ్య నగర్ నందు శ్రీ శ్రీ విజయ దుర్గ ఆలయం నందు బాక్స్ ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన దేవీ నవరాత్రి మహోత్సవ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. కోటిపల్లి బస్టాండ్ శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో బట్లంకి నాగప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన దేవీ నవరాత్రి మహోత్సవ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు.

గోదారమ్మకు పూజలు, హారతులు


గోదావరి నిత్యహారతుల కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ: పవిత్ర అఖండ గోదావరి నదికి పుష్కర్ ఘాట్ వద్ద ఆదివారం నిత్య హారతులిచ్చారు. శ్రీ శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిత్య హారతుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు పండితులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. తొలుత గోదావరి తల్లికి కుంకుమార్చన, విశేష పూజలు ఎంపీ చేతుల మీదుగా చేయించారు. అనంతరం పుష్కర్ ఘాట్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి పురోహితులు గోదావరి నదికి హారతులిచ్చారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన తెలంగాణ అధికారులు

కడియం: తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు ఉన్నతాధికారుల బృందం స్థానిక పల్ల వెంకన్న నర్సరీని ఆదివారం సందర్శించింది. తెలంగాణ సెంట్రల్ జోన్ డీసీపీ కమలాసన్ రెడ్డి, హైదరాబాద్ రైల్వే జోన్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ కె.సాంబశివరావు తదితరులతో కూడిన ఈ బృందానికి నర్సరీ రైతులు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్‌లు వివిధ రకాల మొక్కల గురించి వివరించారు. వారి వెంట కేశవభట్ల ట్రస్టు చైర్మన్ కేశవభట్ల శ్రీనివాస్ ఉన్నారు.

శెట్టిబలిజ, గౌడలకు ప్రాధాన్యమిస్తున్న సీఎం జగన్

రాజ్యసభ సభ్యుడు బోస్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్, చిత్రంలో నాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శెట్టిబలిజ, గౌడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాస్‌చంద్ర బోస్ అన్నారు. ఆదివారం రాత్రి శాటిలైట్ సిటీ ఏ బ్లాక్, హుకుంపేట డిబ్లాక్‌లో బీసీ గౌడ, శెట్టిబలిజ సంఘ నేతలతో రాష్ట్ర గౌడ, శెట్టిబలిజ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా పిల్లిసుభాష్‌చంద్రబోస్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ముందుగా శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ సమాజంలో అత్యధిక సంఖ్యాబలం ఉన్న బీసీ సామాజిక వర్గీయులు ఒక కుటుంబ సభ్యుల్లా ఏకతాటిపైకి రావాలన్నారు. ఆర్థికంగా, సామాజిక పరంగా చైతన్యవంతులు కావాలని అన్నారు. ఒకే మాట, ఒకే బాటగా మనమంతా చేయి చేయి కలిపితే రాజ్యాధికార దిశగా అడుగులు వేయడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ అధికారంలోకి రాగానే సీఎం జగన్ గౌడ శెట్టిబలిజ కులస్తులకు శాసనసభలో శాసనమండలిలో, లోక్‌సభలో, రాజ్యసభలో అవకాశాలు కల్పించినందుకు వైఎస్సార్ సీపీకి బీసీలంతా రుణపడి ఉండాలన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ భవిష్యత్తులో బీసీలకు రాజకీయాధికారం దిశంగా అందరూ అడుగులు వేయాలన్నారు. తమకు ఏ సమస్య వచ్చినా నేనున్నాననే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. బీసీ సామాజిక వర్గం పిల్లలకు మంచి విద్య తద్వారా ఉన్నత భవిష్యత్ కల్పించమని సూచించారు. రాష్ట్రంలో జగన్ నాయకత్వంలోని వై ఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అలాగే బీసీలంటే జగనన్నకు ఎనలేని అభిమానమని తెలిపారు. బీసీలకు ఏ సమస్య వచ్చినా దాని పరిష్కారానికి సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. పాలిక శ్రీను మాట్లాడుతూ శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలను ఈజాతి ఉన్నంతవరకు గుర్తించుకునేలా ప్రతి గ్రామంలోను తన సొంత నిధులతో నెలకొల్పుతానన్నారు.

సివిల్స్ విద్యార్థినికి స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సివిల్స్ విద్యార్థిని కోళ్ల జ్యోత్స్నకు రూ.7వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఆదివారం దసరా సెలవుల సందర్భంగా ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమంను నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఇది జరిగింది. ఉపాధ్యాయులు రవిచంద్ర గణితంలో మెళుకువలు నేర్పారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ముందుగా రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు చలుమూరి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ కార్యదర్శి శ్రీ మతల రమేష్ మాట్లాడుతూ రిటైర్డు తహసీల్దార్ పోలిశెట్టి తాతారావు సహకారంతో జ్యోత్స్నకు సివిల్స్ ప్రిపరేషన్ మెటీరియల్ అందజేశామన్నారు. . ట్రస్ట్ సభ్యులు లాలం శ్రీను, ఆదిరెడ్డి శ్రీను, అల్లు సత్యనారాయణ, తిరుమలరెడ్డి అప్పారావు, బొడ్డు శ్రీను, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర, లైబ్రేరియన్ శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి కలాంను రోల్‌మోడల్‌గా తీసుకోవాలి

జిల్లా ఎస్పీ జగదీష్


వివిధ పోటీలలో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న ఎస్పీ జగదీష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి విద్యార్థి అబ్దుల్‌కలాంను స్ఫూర్తిగా తీసుకుని గ్లోబల్ సిటిజన్‌గా ఎదగాలని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని అబ్దుల్‌కలాం ఐఏఎస్, ఐఐటీ, నీట్ అకాడమీ, జూనియర్, మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం భారతరత్న, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 92వ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో మహిళల మిస్సింగ్‌కు సంబంధించిన కేసులు ఎక్కువగా ఉన్నాయని, అందులో 15 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు వారే ఎక్కువ అన్నారు. ఎక్కువ కేసుల్లో ప్రేమ కారణమవుతుందని, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో లైసెన్స్ లేని మైనర్ పిల్లలు వాహనాలు నడపడం వల్ల, మద్యం సేవించడం వల్ల యాక్సిడెంట్‌లు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. 18 ఏళ్ల వయస్సు వచ్చే వరకు పిల్లలకు బైక్‌లు ఇవ్వద్దని సూచించారు. కలాం అకాడమీ నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు రూ.50 వేల నగదు బహుమతి, మెడల్స్, సర్టిఫికెట్లను ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. ముందుగా కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హోమ్ టు కాలేజ్ సిటీ గర్ల్స్ క్యాబ్స్ రెండింటికి జెండా ఊపి ఎస్పీ జగదీష్ ప్రారంభించారు. ప్రముఖ న్యాయవాది ఎం.పద్మావతి, 2023 గ్రూప్–1విజేత కలాం విద్యార్థి పి.కృపాలు మాట్లాడారు. సంస్థ డైరెక్టర్ గేదెల సూర్యకుమారి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చార్జీల పెంపుపై ప్రజా బ్యాలెట్

ప్రకాశం నగర్ : వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆజాద్ చౌక్‌లో విద్యుత్ చార్జీల భారంపై ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రాసి నగర కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలపై చార్జీల భారం మోపుతోందని విమర్శించారు.

యువతరానికి అబ్దుల్ కలాం స్ఫూర్తి


కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు


కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాగేశ్వర్ తదితరులు


వేమగిరిలో కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

సీటీఆర్ఐ: అబ్దుల్ కలాం 92వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక నందం గనిరాజు జంక్షన్ వద్ద యాంకర్ చోటు ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలలో వైఎస్సార్ పీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగేశ్వర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అబ్దుల్ కలాం వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ ఆరిఫ్ స్థానిక బిలాల్ షాదీ ఖానాలో ఏర్పాటు చేసిన జయంతి సభలో పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరిఫ్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో భారతదేశాన్ని ప్రపంచానికే ఆదర్శంగా నిలిపిన గొప్ప శాస్త్రవేత్త కలాం అన్నారు. కరీం ఖాన్, అడ్వకేట్ ఆరిఫ్, సయ్యద్ హసన్, సయ్యద్ మదిని, మహమ్మద్ షబ్బీర్, అమానుల్లా బేగ్, షేక్ షాజహాన్, షట్టర్ భాష, జాహీద్ అక్తర్,మొహమ్మద్ గౌస్, రషీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కలాం సేవలు ఎనలేనివి

కడియం: రాష్ట్రపతిగా, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అబ్దుల్ కలాం సేవలు ఎనలేనివని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాస రావు అన్నారు. కలాం జయంతిని వేమగిరి బుద్ధవిహారా వ్యవస్థాపకులు మైత్రేయ, చేళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి కళా సేవా సమితి అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో కలాం జయంతి ఆదివారం నిర్వహించారు. మద్రి సుబ్రహ్మణ్యం, గౌరవ్, పీఎస్ఎన్ రాజు, మూర్తి, ప్రత్తిపాటి నల్లరాజు పాల్గొన్నారు.

ఉల్లాసంగా హ్యాపీ స్ట్రీట్


హ్యాపీ స్ట్రీట్‌లో పాల్గొనేందుకు తరలివచ్చిన నగర ప్రజలు

రాజమహేంద్రవరం సిటీ: ఆదివారం వచ్చిందంటే చాలు నగరంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ హ్యాపీ స్ట్రీట్‌లో ఉల్లాసంగా గడిపేస్తున్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జేఎన్ రోడ్డులోని ఏకేసీ కాలేజీ పక్కనే గల పరమ హంస యోగానంద మార్గ్‌లో ప్రతి ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ నిర్వహిస్తున్న విభిన్న రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నగర ప్రజలను ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద దీరుస్తున్నాయి. చిన్నారులు, యువత డ్యాన్స్ పోటీలలో ఆహుతులను ఉత్తేజ పరుస్తున్నారు. మ్యూజిక్ ప్రోగ్రాం మోదలి కుని ఆటలు, పాటలతో చిన్నారులు, యువత ఆనందంగా గడిపేస్తున్నారు. చిన్నారులకు హైడ్ అండ్ స్లీక్, చదరంగం, బ్యాట్మింటన్, క్యారమ్స్ ఇలా పలు రకాలు ఆటలు ఆడుకునేందుకు ఏర్పాటు చేశారు. హ్యాపీ స్ట్రీట్‌లో పాల్గొనేందుకు ప్రతీ ఆదివారం నగర ప్రజలు విశేష సంఖ్యలో తరలివస్తున్నారు.

ఎల్లలు దాటి వచ్చిన నృత్య నీరాజనం

- సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేందుకు సంపూర్ణ భారతదేశ యాత్ర
- 63 రోజుల పాటు 22 రాష్ట్రాల్లో కొనసాగిన వైనం



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్



ముగింపు ఉత్సవంలో నృత్యం చేస్తున్న కళాకారిణులు

సీటీఆర్ఐ: మన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరం పూర్తిగా మరచిపోతోందని, పాశ్చాత్య ధోరణిలో నేటి తరం సాగుతోందని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ అన్నారు. ఆదివారం శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 11వ తేదీన ప్రారంభించిన సంపూర్ణ భారత సంస్కృతి యాత్ర ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. 63 రోజుల పాటు, 22 రాష్ట్రాలలో, 17వేల కిలోమీటర్లు సాగిన ఈ యాత్ర ద్విగ్విజయంగా పూర్తి చేసుకుని శనివారం రాజమహేంద్రవరం నగరానికి చేరుకుంది. ఆదివారం ముగింపు కార్యక్రమం సందర్భంగా పాల్గొన్న నాట్యకారిణిలకు కమిషనర్ దినేష్‌కుమార్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు జీబీ నారాయణ మాట్లాడుతూ మన శాస్త్రీయ నృత్యాలను నేర్చుకొని వాటిని తిరిగి పునరుత్తేజితం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు. కూచిపూడి, భరతనాట్యం వంటి మన కళలు మసకబారిపోయి వెస్ట్రన్ డాన్స్, బ్రేక్ డాన్స్ వంటివి మన సంస్కృతిని ఆక్రమించాయన్నారు. నేటి టీవీ షోలలో కూడా వీటికే అగ్రతాంబూలం ఇస్తున్నారన్నారు. నేటి యువత కూడా జుగుప్సాకరమైన వస్త్రధారణతో టీవీ షోలలో అశ్లీల నృత్యాలు చేస్తూ ఆనందిస్తున్నారన్నారు. వీరి తల్లితండ్రులు కూడా వీటికే సై అంటున్నారని, కాని మనకంటూ ఒక చరిత్ర, ఒక సంస్కృతి, ఒక సంప్రదాయాలు ఉన్నాయన్నారు. వాటిని కాపాడుకోలేక పోతే మన సంస్కృతి మరుగునపడిపోతుందని చెప్పారు. శ్రీ శివక్షేత్రం అధిపతి శ్రీశివస్వామి మాట్లాడుతూ భారతదేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలోని దేవాలయాలలో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి తద్వారా కూచిపూడికి పూర్వ వైభవం తీసుకుని రావడానికి భగీరథ ప్రయత్నం తలపెట్టారన్నారు. అయినవిల్లి, మహానంది, శ్రీశైలం, విజయవాడ, అన్నవరం, సింహాచలం, బాసర, వేములవాడ, యాదగిరి గుట్ట, భద్రకాళీ టెంపుల్, భద్రాచలం, పూరి, కాళీఘాట్, సూర్యానారాయణ దేవాలయం, శక్తిపీఠం, వారణాసి, కేదారినాథ్,జ్వాలా దేవీ, వైష్ణవి దేవాలయం, అమృత్‌సర్, కార్తీకేయ టెంపుల్, బృందావనం, ఉదయపూర్, షీర్డీ మంత్రాలయం, తిరువనంతపురం, కన్యాకుమారి, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలలోని దేవాలయాలలో కూచిపూడి నృత్యాలను ప్రదర్శించి ఆయా దేవాలయాల స్వామిజీల ఆశీస్సులు పొందారన్నారు. బీవైఎస్ఎస్ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ రోషణ్ గుప్త, విశాల్ శర్మ, జి.ఉమాజయశ్రీ, జి.లక్ష్మీ దీపిక పాల్గొన్నారు.